
రాజేంద్రనగర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో జరిగిన వనమహోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సందర్శించిన సిఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి, పిసిసిఎఫ్ సువర్ణ, అగ్రికల్చర్ వర్సిటీ విసి జానయ్య తదితరులు



హైదరాబాద్ వార్త

# గాంధీ, ఉస్మానియాలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయండి

**వైద్యాధికారులకు జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ఆదేశం**

**హైదరాబాద్, జూలై 7,ప్రభాతవార్త:** ప్రభుత్వం వైద్యంపై అతంత్య ప్రాధాన్యత ఇస్తున్నందున, గాంధీ, ఉస్మానియా ఆసుపత్రులలో అన్ని మౌలిక సదుపాలయాలు కల్పించేలా పక్కా ప్రణాళికలు సిద్ధం చేసి, నివేదిక ఇవ్వాలని కలెక్టర్ హరిచందన దాసరి వైద్య అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల వైద్య అధికారులతో ఆసుపత్రులలో కల్పిస్తున్న వసతులు, సదుపాయాలపై మెడికల్ కాలేజీల మానిటరింగ్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల ప్రజలు ఆరోగ్య సమస్యలపై అధిక సంఖ్యలో రావడం అలాగే తెలంగాణలో అతిపెద్ద ఆసుపత్రులైన గాంధీ, ఉస్మానియాలలో వైద్యం పరికరాలతో పాటు, వసతులు సైతం ఉండాలని అందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా సదుపాయాలు, వైద్య సిబ్బంది కొరత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, బోధన, బోధనేతర సిబ్బంది, ఔట్ సోర్సింగ్,కాంట్రాక్ట్ పద్దతి సిబ్బందిని నియమాకం వంటి అంశాలపై కూలంకుషంగా చర్చించారు. గాంధీ ఆసుపత్రిలో నీటి సమస్యలు ఉన్నట్లు కలెక్టర్ దృష్టికి డాక్టర్లు తీసుకురాగా ఆసమస్యను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ఆదేశించారు. అలాగే ఔట్ సోర్సింగ్ ప్రాతిపదిక టీచింగ్ స్టాప్ భర్తికీ ప్రభుత్వ నిభందన ప్రకారం భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రక్రిను నిర్ధేశించిన సమయంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమాశంలో అదనపు కలెక్టర్‌ముకుంద రెడ్డి, ఇంచార్జీ డిఆర్‌ఓడి. శ్రీధర్, ఆర్‌డిఓలు రామకృష్ణ, సాయిరామ్, డిఎంహెచ్‌ఓ డా.వెంకటి, ఉస్మానియా హాస్పిటల్ అదనపు డియంఈ డా. వాణి, గాంధీ ఆసుపత్రి పర్యవేక్షకులు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన దాసరి

# మోసం చేస్తారు...విదేశాలకు చెక్కేస్తారు..!

- చీటింగ్ కేసులతో పోలీసులకు తలనొప్పులు
- రికవరీకి ఏళ్లుగా వేచిచూపులు
- తాజాగా ఉద్యోగాలంటూ డబ్బులు వసూలు చేసి పరారవుతున్న నిందితుడుని ఢిల్లీలో పట్టివేత



**హైదరాబాద్, జూలై 6, ప్రభాతవార్త:** అమాయకులతో కోట్ల రూపాయలు కొల్లగొట్టి విదేశాల్లో తలదాచుకుంటున్నారు క్రిమినల్ నేరస్తులు. రియల్ఎస్టేట్, చిట్‌ఫండ్, చిట్టీల బిజినెస్ ఇలా ఎన్నో రకాలుగా లక్షలాది, కోట్లాది రూపాయాలు అప్పనంగా దోచుకొని దేశాన్ని దాటుతున్నారు. ఇక పోలీసుల టెన్షన్లు ఉండవని దోపీడిగాళ్లు విదేశాల్లో పెట్టుబడులు పెట్టి లగ్జరీలైఫ్‌ను అనుభవిస్తున్నారు. దీంతో బాధితులు పోలీస్ స్టేషన్లు చుట్టు తిరుగుతూ అలసిపోయి ఆశగా వేచిచూస్తున్నారు. ఏళ్లు గడిచిన కష్టపడి సంపాదించినదంతా రాకపోవడంతో కొందరు ఆర్థికంగా నష్టపోగా.. మరికొందరు ఆత్మహత్యలే శరణ్యమంటూ మరణశాసనాలు రాసుకుంటున్నారు. ఎవరో చేసిన తప్పులకు అమాయకులు బలైపోతున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అనధికారికంగా ఎన్నో ఆర్థిక సంస్థలు పుట్టుకొస్తున్నాయి. కొడితే లైఫ్ సెట్ అయిపోవాలనే ఫార్ములాతో మోసగాళ్లు తెగిడుస్తున్నారు. ఇలాంటి వారిని గుర్తించడంలో పోలీసులు వైఫ్యలం చెందారనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. నష్టపోయిన సొమ్ముకు బాధ్యులేవరని బాధితులు ప్రశ్నిస్తున్నారు. తాజాగా జార్ఖాండ్‌లో ఉద్యోగాలంటూ నమ్మించి డబ్బులు వసూలు చేసిన శ్రీనాథ్ విదేశాలకు పరారవుతుండడంతో గుర్తించి ఢిల్లీలో పట్టుకున్నారు. గత ఐదేళ్లలో 24మంది ఆర్థికనేరగాళ్లు ఉన్నట్లు పోలీస్ రికార్డులు చెబుతున్నాయి.

**కష్టపడి సంపాదించినంతా..మోసాలపాలు..!**

రూపాయి..రూపాయి కష్టపడి కూడబెట్టుకున్న సొమ్ము మోసాగాళ్ల పాలవుతున్నాయి. చిట్టీలు, చిట్‌ఫండ్స్, విదేశీ విద్య, ఉద్యోగాలు, పెట్టుబడులు, ఇలా ఎన్నోరకాలుగా అమాయకుల నుంచి దోచుకుని పారిపోతున్నారు. పోలీసులు ఎంతగా ప్రయత్నించిన నేరస్తులు దొరకడంలేదు. పోయిన సొమ్ము రాబట్టడం లేదు. ఏళ్ల తర్వాత అయిన రికవరీ అవుతుందా అంటే చెప్పలేని పరిస్థితి. ఒక్కొక్కరు పెట్టుబడులు, పిల్లల చదువు, వ్యాపారాభివృద్ధి, గృహాల కొనుగోళ్లు ఇలా ఎన్నో ఆశలు పెట్టుకున్నవారంత అడియాశలు అవడమేకాకుండా ఆర్థికంగా నష్టపోతున్నారు. భరించలేక మరి కొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. గత ఐదేళ్లలో మోసానికి బలైన బాధితులు ఐదుగురు ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. మరెంతో మందికి అరెస్ట్‌వారెంట్ జారీచేసి నిందితులు పారిపోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వెల్లడిస్తున్నారు. మూడేళ్ల క్రితం చిట్‌ఫండ్స్ పేరిట డబ్బులు వసూలుచేసి పారిపోయేందుకు యత్నించాడు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులోనే అదుపులోకి తీసుకున్నారు. జీడిమెట్లలో చిట్టీల వ్యాపారం చేసి పరారవుతుండడంతో నిఘాపెట్టి అరెస్ట్ చేశారు. ఇలాంటి ఘటనలు పలు ఉన్నాయి. అయితే బాధితులు ఆశతో కొంత వచ్చిన చాలూ అని పోలీస్ స్టేషన్ల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. ఏళ్లు గడిచినా ఫలితం లేకుండా ఉండడంతో అనేకకష్టాలు పడుతున్నారు. అప్పులు పెరగడం, పిల్లల విద్య ఆగిపోవడం, ఇంటి కొనుగోలుపై వెనక్కితగ్గడం వంటి కోరికలు మోసాలతో దిక్కుతోచని పరిస్థితిలో జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వాలే ఇలాంటి వారిని గుర్తిస్తే అమాయకులు మోసాలకు గురికాకుండా ఉండేవారని ఆర్థికవేత్త నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# మోదీ ప్రభుత్వ విధానాలు వినాశకరం

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు నరసింహ**

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త** మతతత్వవాదులను తరిమేందుకు బలమైన పోరాటాలు నిర్వహించాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి.నరసింహ పిలుపు నిచ్చారు. వందేళ్లుగా సామ్యవాద భావజాలానికి, లౌకిక ప్రజస్వామ్య విలువలకు అంకితమై, దేశంకోసం, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఉన్నత ఆశయాలతో, ప్రజల హక్కుల కోసం ప్రజలు తరుపున రాజీ లేని పోరాటలు చేస్తున్న పార్టీ సిపిఐ ఒక్కటేనన్నారు. సోమవారం అంబర్‌పేట, దుర్గానగర్‌లోని కృష్ణరెడ్డి ఫంక్షన్ హాళ్లలో సిపిఐ అంబర్‌పేట్ నియోజకవర్గం నాలుగో మహాసభ జరిగింది. అంబర్‌పేట సెగ్మెంట్ పార్టీ కార్యదర్శి బి.వెంకటేశం అధ్యక్షతన జరిగిన ఈ మహాసభకు ఈ.టి. నరసింహ ముఖ్యఅతిథిగా పాల్గొనగా సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ.టి.నరసింహ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు వినాశకరమైనవని, రోజురోజుకు పెరుగుతున్న అధిక ధరలు, మండుతున్న పెట్రోల్, గ్యాస్ ధరలు, రైతు వ్యతరేక చట్టాలు, కార్మిక వ్యతరేక 4 లేబర్ కోడ్లు సామాన్య ప్రజలతోపాటు రైతులు, కార్మికులు, యువతకు తీరని ద్రోహం చేస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను, రైతు వ్యతరేక చట్టాలు, నాలుగు లేబర్ కోడ్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఈనెల 9వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెకు సిపిఐ మద్దతు తెలుపుతుందని, ఈ సమ్మెలో సిపిఐ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలనీ పిలుపు నిచ్చారు. సిపిఐ పార్టీని బలోపేతం చేయడానికి, పార్టీ సిద్ధాంతాన్ని, లక్షయాలను ప్రజలకు మరింత చేరువ చేయాలనీ, పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆయన కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఎస్.ఛాయాదేవి మాట్లాడుతూ అన్యాయమైన విధానాలు అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా బలమైన ఉద్యమాలు నిర్మించడం అవసరమని, ప్రజల మధ్య తగువులు పెట్టి హింసను ప్రేరేపించడం వంటి చర్యలకు పాల్పడుతున్న మోదీ సర్కార్ ను గద్దెదించడం అనివార్యం అని అన్నారు.

కార్మికుల శ్రమ దోపిడీ కోసం రాష్ట్రంలో కార్మికుల 8 గంటల పని విధానాన్ని మర్చి 10 గంటల పని చేయాలనీ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన జిఓ ను తక్షణమే రద్దు చేయాలనీ ఆమె డిమాండ్ చేసారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి. కమతం యాదగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్ శ్రీకాంత్, ఎండి.ఉమర్ ఖాన్, జిల్లా సమితి సభ్యులు చెట్టు కింద శ్రీనివాస్ నాయకులు జి శ్రీనివాస్ జై లింగస్వామి ఎస్ రాము ఎస్ నాగరాజు కే రవి కే గణేష్ ఏ బిక్షపతి, వెంకటేష్ కుమార్ తదితదిలో పాల్గొన్నగా బి. వెంకటేశం తిరిగి అంబర్‌పెట్ నియోజకవర్గం పార్టీ కార్యదర్శిగా, సహాయ కార్యదర్శిగా కాశయ్య ఎన్నికైయ్యారు.



మాట్లాడుతున్న నరసింహ

# న్యాయవాదులు రాజకీయాల్లో భాగస్వాములు కావాలి

**బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు**

**హైదరాబాద్, జూలై 7 ప్రభాతవార్త** సమాజసేవలో న్యాయవాదులు భాగస్వాములు కావాలని సీనియర్ నాయవాది, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు పేర్కొన్నారు. నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా రామచందర్‌రావు నియమితులైన సందర్భాన్ని పురస్కరించుకుని బార్ అసోసియేషన్ హాలులో సన్మాన సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ న్యాయవాదులు సమాజానికి నాయకులని, సమాజంలోని అన్ని వర్గాల వారితో సత్‌సంబంధాలు గల న్యాయవాదులు తమ న్యాయవాద వృత్తితో పాటు రాజకీయాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమాజంలోని మంచి చెడ్డలు, ప్రజల కష్టసుఖాలను దగ్గర నుండి చూసినవారు న్యాయవాదులన్నారు. రాజకీయాలలో తాను డబ్బు సంపాదించుకోవడానికి రాలేదని, సమాజ సేవ కోసం వచ్చానని తెలిపారు. పార్టీకి కార్యకర్తలకు సమాజ సేవ కోసమే తాను అంకితమవుతానన్నారు. రాజకీయాలలో, న్యాయవాద వృత్తిలో పైకి వచ్చే వారిని ఎదగనివ్వాలని పేర్కొన్నారు. రాజకీయాల్లో నిలదొక్కుకోవడం చాలా కష్టంగా ఉంటుందన్నారు.ఎవరైనా రాజకీయాల్లో రాణించాలంటే ఓపిక, మౌనం అవసరమని తెలిపారు. నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు రవి కిషోర్ మాట్లాడుతూ రామచంద్రరావు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షులుగా చేసిన సేవలు మరువజాలవని అన్నారు. నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ నుండి బిజెపి రాష్ట్ర శాఖ అధ్యక్షునిగా రామచంద్రరావు ఎదగడం అభినందనీయమన్నారు. బార్ అసోసియేషన్ అభివృద్ధికి తన సొంత నిధులను ఇచ్చిన ఘనత రామచందర్‌రావుకే దక్కుతుందని హర్షం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ గౌడ్, రాజవర్ధన్ రెడ్డి, కరుణా సాగర్, బాలరాజ్, సురేఖ సింగ్, నాగేందర్, ప్రభాకర్ రెడ్డి, శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామచందర్‌రావు

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు...

**నిజాంపేట్, జూలై 7, ప్రభాతవార్త :** 11కేవీ శ్రీ హోమ్స్ ఫీడర్‌లో నేడు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీహోమ్స్, ఏఎస్ఎన్ బృందావన్ కాలనీ, కెవిఆర్ ప్యారడైజ్ కాలనీ అలాగే 11కేవీ క్రాంతి నగర్ ఫీడర్‌లో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు క్రాంతినగర్ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని బాచుపల్లి ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

## పలికితేనే ఫలితాలనిచ్చే మంత్రాలే ఉపనిషత్తులు

**శ్రీపుష్పగిరి పీఠాధిపతులు అభినవోద్దండ విద్యాశంకర భారతీ మహాస్వామిజీ**

**నాంపల్లి, జూలై 7 ప్రభాతవార్త :** పలికితేనే ఫలితాలనిచ్చే మంత్రాలే ఉపనిషత్తులని, ఉపనిషత్తులమీద పుస్తకం... ఋషులైతే తప్ప ఉపనిషత్తులను వ్రాయడానికి కుదరని కృషి... అందుకే కృషివుంటే మనుషులు ఋషులవుతారు అన్నట్లు రచయిత విజయభాస్కర్ ఎంతగానో చేసిన కృషితో ఉపనిషత్కాంతి సృష్టిగర్భ గ్రంథాన్ని ఆత్మబల నిష్టతో వ్రాయగలిగారని శ్రీపుష్పగిరి పీఠాధిపతులు శ్రీఅభినవోద్దండ విద్యాశంకరభారతీ మహాస్వామీజీ అన్నారు. కవితం వ్రాయడంవేరు ... ఉపనిషత్తులను ఉపక్రమించడం వేరన్నారు. ఉపనిషత్తు పర్యాయపదంగా తెలుగులో సృష్టిగర్భ పేరు ఉన్నతిగా ఉండడంలోనే ఆయన విజయసిద్ధి కనబడుతుందన్నారు.డా. కె.వి.రమణాచారి అధ్యక్షోపన్యాసంలో గంభీర సాగర సమాన విస్తరణతో సృష్టి ఆవిర్భావ రహస్యాన్ని ఛేదించి సమస్త ప్రకృతిని, మానవ పట్టుదలని విడమర్చిచెప్పిన ద్వాదశ ఉపనిషత్తుల సారమే ఈ సృష్టిగర్భ ఉపనిషత్కాంతి గ్రంథమని అన్నారు. ఇందులోని ప్రతీ అక్షరం చరణాలు ఎంతో సుందరంగా అందరికీ ఎంతో సులువుగా అర్థమయ్యేరీతిలో రచయిత విజయభాస్కర్ రచించారన్నారు. ఉపనిషత్ తత్వ విషయాన్ని తెలిపేందుకే ఎక్కువగా కృషిచేశారన్నారు. కర్తవ్యోన్ముకిడ్ని చేసే వేదాంతాన్ని మనకు స్పురింపజేశారని తెలిపారు. రచయిత 108 ఉపనిషత్తులో పన్నెంటిడిని మాత్రమే తీసుకున్నారని వాటిని వివరించారు. ఇవన్నీ తెలిపిన విజయభాస్కర్ ఋషితుల్యుడయ్యాడని రమణాచారి అభివర్ణించారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీ అభినవోద్దండ విద్యాశంకరభారతీ మహాస్వామివారు విశిష్ట అతిథులు ధర్మాన ప్రసాదరావు, మండలి బుద్ధప్రసాద్, అందెశ్రీ, డా. ఓలేటి పార్వతీశం, రచయిత డి.విజయభాస్కర్, సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్ తో కలిసి ప్రముఖ రచయిత, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత డా. దీర్ఘాసి విజయభాస్కర్ రచించిన సృష్టిగర్భ (ఉప నిషత్కాంతి) గ్రంథాన్ని ఆవిష్కరించగా రచయిత విజభాస్కర్ తొలి ప్రతిని మండలి బుద్ధప్రసాద్ దంపతులకు అందజేసి ఘనసత్కారంతో అంకితోత్సవం కావించారు. అనంతరం రచయిత దంపతులను సన్మానించారు.ముందుగా సభకు మద్దాళి రఘురామ్ స్వాగతం పలికారు. సభకు ముందు గాయని డి.సురేఖామూర్తి సంగీతలోకంలో విహరింపజేసింది.

# గోడ తీస్తే 3.. మూస్తే 8 కిలోమీటర్లు

*** ఫలించిన మల్లంపేట ప్రజల పోరాటం * అడ్డుగా ఉన్న గోడను తొలగించిన హైడ్రా**

**హైదరాబాద్, జూలై 7,ప్రభాతవార్త:** దారికి అడ్డంగా కట్టిన గోడ వేలాది ప్రజలకు గోసగా మారి ఆఖరుకు అది పోరాటంగా మారింది. ఔటర్ రింగు రోడ్డు ఎగ్జిట్ 4 నుంచి మల్లంపేట, బాచుపల్లి క్రాస్‌రోడ్స్ మీదుగా ప్రగతినగర్‌కు సులభంగా చేరుకునే మార్గం దొరకక అవస్థలు పడ్డవాళ్లు కొందరైతే.. మాది గేటెడ్ కమ్యూనిటీ మా కాలనీలో నుంచి రాకపోకలు బంద్ అంటూ అడ్డుగోడలు కడుతున్నవారు మరికొంతమంది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ మండలంలోని మల్లంపేట బాచుపల్లి గ్రామాల మధ్య నెలకొన్న వివాదం ఇది. మల్లంపేట ఔటర్ రింగురోడ్డు ఎగ్జిట్ నుంచి బాచుపల్లి క్రాస్ రోడ్స్ మీదుగా ప్రగతినగర్‌కు కేవలం 3 కిలోమీటర్లు మాత్రమే ప్రయాణిస్తే సరిపోతోంది. కాని దారి మధ్యలో ప్రణీత్ ఆంటిల్యా నిర్మించిన అడ్డుగోడతో8కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందని మల్లంపేట గ్రామప్రజలతో పాటు.. మరో 10 కాలనీల వాసులో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈగోడ తీసేస్తే 60 నుంచి 40 ఫీట్ల వెడల్పుతో ఉన్న అడ్డదారి దొరుకుతుందంటున్నారు. మల్లంపేట ఎగ్జిట్ నుంచి మల్లంపేట విలేజ్, ప్రణీత్ లీఫ్‌కాలనీ, ఆకాష్ వెంచర్, డ్రీం వ్యాలీ కాలనీ, గ్రీన్‌పార్కు కాలనీ, సాయినగర్ కాలనీ, బృందావన్ కాలనీ, ఏపీఆర్ కాలనీ, ఇందిరమ్మకాలనీ, లక్ష్మి శ్రీనివాస్ కాలనీ, హెచ్ ఎండీఏ, ప్రణీత్ ఆంటిల్యా, బాచు పల్లి చౌరస్తా మీదుగా ప్రగతినగర్‌కు కేవలం 3 కిలోమీటర్ల రాజమార్గంలో రాడానికి అవకాశం ఉన్నా అడ్డుగోడలు పెట్టారని 25 వేల మందికి పైగా అవస్థలు పడుతున్నామని ఇటీవల పలువురు హైడ్రాకు ఫిర్యాదు చేశారు.


రాకపోకలకు అడ్డుగా ఉన్నగోడను తొలగించిన హైడ్రా

**హైడ్రా పరిశీలించి చర్యలు....**

ఈ నేపథ్యంలోనే మల్లంపేట ప్రజల ఫిర్యాదుపై హైడ్రా లోతైన పరిశీలన చేసింది. హెచ్ఎండీఏ అనుమతులను పరిశీలించింది. ప్రణీత్ ఆంటిల్యా గేటెడ్ కమ్యూనిటీ కాదని హెచ్ ఎండీఏ అనుమతిచ్చినలేఔట్ స్పష్టం చేస్తోంది. హెచ్ ఎండీఏ అనుమతుల్లో 7వ అంశాన్ని పరిశీలిస్తే గేటెడ్ కమ్యూనిటీ కాదని నివాస ప్రాంతాలకు చుట్టూ ప్రహరీ నిర్మించరాదని మరీ ముఖ్యంగా రహదారులకు అడ్డంగా గోడలు నిర్మించరాదని పక్కన ఉన్న కాలనీవాసులకు దారి చూపాలని ఎంతో స్పష్టంగా పేర్కొంది. ఆ క్రమంలోనే అక్కడి ప్రహరీలను హైడ్రా ఇటీవల తొలగించింది. తర్వాత ప్రణీత్ ఆంటిల్యా కాలనీ వాసుల నుంచి అభ్యంతరాలు రావడంతో మరింత లోతుగా అధ్యయనం చేసింది. ప్రణీత్ ఆంటిల్యా నివాసాల మధ్య నుంచే గతంలో బళ్లదారి ఉండేదని రెవెన్యూ అధికారులుచెబుతున్నారు. నిజాంపేట మున్సిపల్ అధికారులు ఇది గేటెడ్ కమ్యూనిటీ కాదని నిర్ధారించారు. దీంతో ఇరుపక్షాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసింది. మున్సిపల్, రెవెన్యూ అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇరు పక్షాల సమక్షంలోనే ఇది గేటెడ్ కమ్యూనిటీ కాదు.. దారి ఇవ్వాల్సి ఉంటుందని సమావేశం నిర్ణయించించి చివరు అక్కడ నిర్మించి గోడను కూల్చివేసింది. దీంతో మల్లంపేట్ ప్రజలకు దారి సుముగమం అయ్యింది.

## పనోడే..దొంగగా మారాడు..!

**-సిసి కెమెరాతో ముగ్గురు నిందితులు అరెస్టు**

**-రూ.2.15 లక్షల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం**

**కుత్బుల్లాపూర్, జూలై 7 ప్రభాతవార్త :** బంధువుల ఇంటికి విందుకు వెళ్తున్నాం..గొళ్లెం తీసి ఉంచి అని పిల్లలకు చెప్పిన తల్లిదండ్రులు బయటకు తిరుగొచ్చేసరికి చోరీ జరిగింది. ఇంట్లో ఉన్న నగదు,సెల్‌ఫోన్‌లు ఎత్తుకెళ్లిన పనోడు, ఇద్దరు స్నేహితులను జీడిమెట్ల పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలానగర్ ఏసీపీ నరేశ్‌రెడ్డి తెలిపిన ప్రకారం జీడిమెట్ల పరిధిలోని అపురూపకాలనీలో నివాసముంటున్న పాలవ్యాపారి సంగమేశ్ నివాసంలో ఈ నెల 3న ఇంటి పనివాడైన మహ్మద్‌ఆసీఫ్‌తో పాటు అతని స్నేహితులు ఆసీఫ్, మహ్మద్‌ఆమీర్‌లు కలిసి దొంగతనానికి పాల్పడ్డారు. బయటకు వెళ్తున్నానని పిల్లలకు చెప్పేటప్పుడు మహ్మద్‌ఆసీఫ్ అక్కడే ఉన్నాడు. దీంతో స్నేహితులతో కలిసి పథకాన్ని రచించి 3న రాత్రి దొంగతనానికి వచ్చి రూ.2.15లక్షల నగదు, సెల్‌పోన్‌ను ఎత్తుకెళ్లారు. అయితే సీసీకెమెరాల ఆధారంగా గుర్తించి ఇంటి పనోడే దొంగతనానికి పాల్పడ్డారని గుర్తించి సదరు ఆసీఫ్‌తో పాటు స్నేహితులను అదుపులోకి తీసుకొని విచారించడంతో దొంగతనాన్ని అంగీకరించాడు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కనకయ్య, సిఐ గడ్డం మల్లేశ్, డిటెక్టివ్ ఎస్సై ఎన్.శ్యామ్‌బాబు, ఏఎస్ఐ ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది డి.రాజశేఖర్, ప్రేమ్‌కుమార్, నరేశ్, మోహన్, రాజ్‌కుమార్, సుబ్బారావు పాల్గొన్నారు.

**బాధితులకు సెల్‌ఫోన్లు అందజేత**

**కుత్బుల్లాపూర్, జూలై 7, ప్రభాతవార్త :** బాలానగర్ జోన్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో సెల్ ఫోన్‌లు పొగొట్టుకున్న వారికి జీడిమెట్ల పోలీసులు ఫోన్లు తిరిగి అప్పగించారు. జీడిమెట్ల, సనత్‌నగర్, బాలానగర్, జగద్గిరిగుట్ట పీఎస్ పరిధిలో మొత్తం 69 మందికి వారు పోగొట్టుకున్న ఫోన్లను పోలీసులు తిరిగి అప్పగించారు. మొత్తం వారు పోగొట్టుకున్న ఫోన్ల విలువ రూ.15లక్షల 26వేలుగా పోలీసులు తెలిపారు. సోమవారం జీడిమెట్ల పీఎస్‌లో బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి, జీడిమెట్ల ఇన్స్‌పెక్టర్ గడ్డం మల్లేష్, డీఐ కనకయ్యలతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి బాధితులకు సెల్ ఫోన్లను అందజేశారు. ప్రజలు సెల్ ఫోన్‌లు పొగొట్టుకుంటే వెంటనే సంబందిత పోలీస్ స్టేషన్‌లో సంప్రదించి పిర్యాదు చేయాలని పోలీసులు కోరారు.


గ్రంథావిష్కరణ చేస్తున్న హరికృష్ణ, చెన్నారెడ్డి, అరుణ తదితరులు

## వేమూరు విజ్ఞాన సర్వస్వం చారిత్రక గ్రంథావిష్కరణ

**రవీంద్రభారతి, జూలై 7 ప్రభాతవార్త :** వేమూరు గ్రామచరిత్ర, సంస్కృతిని అద్దంపట్టింది రచయిత్రి డా. కోనేరు (కోగంటి) లక్ష్మీప్రమీల రచించిన వేమూరు విజ్ఞాన సర్వస్వం చారిత్రక గ్రంథమని సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురావస్తు ప్రదర్శనశాఖల పూర్వ పీఠాధిపతి ఆచార్య పేదారపు చెన్నారెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో తేళ్ల అరుణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పేదారపు చెన్నారెడ్డి, సీనియర్ పాత్రికేయుడు ఆలూరి సుభాష్ బాబు, గౌరవ అతిథులు రాజావాసిరెడ్డి మల్లీశ్వరి, బిక్కి కృష్ణ, హరికృష్ణ, జయధీర్ తిరుమలరావు తదితరులతో కలిసి శివసత్యనారాయణ స్మృతిలో రచయిత్రి కోగంటి లక్ష్మీప్రమీల రచించిన వేమూరు విజ్ఞాన సర్వస్వం చారిత్రక గ్రంథాన్ని ఆవిష్కరించారు. అధ్యక్షోపన్యాసంలో అరుణ గతమనే అద్దంలో వర్తమానాన్ని దర్శిస్తూ భవిష్యత్తుకు బాటలు వేయడమే చరిత్రకారుడి కర్తవ్యమన్నారు. అమిర్నేని హరికృష్ణ గ్రంథ పరిచయం కావించారు. ఈ సందర్భంగా అతిథులు రచయిత్రి లక్ష్మీప్రవీమలను ఘనంగా సత్కరించి శుభాభినందనలు తెలిపారు.

## అందెల శ్రీరాములుయాదవ్‌కు రక్షణ కల్పించాలి

**-జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి**


మాట్లాడుతున్న రాములుయాదవ్

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త:** రోహింగ్యాల నుంచి ప్రాణహాని ఉన్న బిజెపి రాష్ట్ర నాయకుడు అందెల శ్రీరాములుయాదవ్‌కు ప్రభుత్వం రక్షణ కల్పించాలని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు మేకల రాములుయాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని మహేశ్వరం నియోజకర్గం నుంచి రెండుసార్లు బిజెపి అభ్యర్థిగా పోటీచేసిన శ్రీరాములుయాదవ్ తన నియోజకవర్గంలోనే నివసిస్తున్న రోహింగ్యాల ప్రాంతాన్ని సందర్శించి ఆధార్, ఓటర్ కార్డులపై ఆరా తీయగా ఆతర్వాత రోహింగ్యాలు ఆయన ఇంటివద్ద రెక్కి నిర్వహించి ప్రాణహాని తలపెట్టే ప్రయత్నం చేశారన్నారు. దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం స్పందించి శ్రీరాములు యాదవ్‌కు భద్రత కల్పించాలని లేనిపక్షంలో యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దయాకర్‌యాదవ్, కిరణ్‌యాదవ్, వెంకటేష్ యాదవ్, మల్లికార్జున్ యాదవ్, వీరేందర్ యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## నేత్రపర్వం కనకదుర్గ భరతనాట్య విభావరి


చిన్నారుల భరతనాట్య ప్రదర్శనలో ఒక దృశ్యం

**రవీంద్రభారతి, జూలై 7 ప్రభాతవార్త :** శ్రీకనకదుర్గ నృత్యవిభావరి ఆధ్వర్యంలో సంస్థ 43వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని సంస్థ డైరెక్టర్, తెలుగు విశ్వవిద్యాలయం పాలన మండలి సభ్యురాలు లయన్ నిర్మలాప్రభాకర్ నేతృత్వంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో సంస్థకు చెందిన 36 నృత్యకుసుమాలచే భరతనాట్య ప్రదర్శన రసభరితం, నేత్రపర్వంగా జరిగింది. ముందుగా చిన్నారి కళాకారిణులు శ్లోకంతో భరతనాట్య ప్రదర్శనను ప్రారంభించి ఆదితాళంలో అలరిప్పు; వినాయక కీర్తనం; రామరసం; తోడిరాగం రూపకతాళంలో వర్ణం; శివపంచాక్షరి, శనాష్టకం; త్యాగరాజ పంచరత్నం; భావయామి రఘురామం; శివకౌత్వం; సావేరి రాగం ఆదితాళంలో జతిస్వరం; కామోజిరాగం మిశ్రచాపుతాళంలో శబ్దం; హిందోళరాగం ఆదితాళంలో తిల్లానా చివరిగా అయిగిరినందిని అంశాలను అత్యంత అద్భుతంగా ప్రదర్శించి ఆహుతుల హర్షధ్వానాల మధ్య ప్రశంసలు, శుభాశీస్సులు అందుకున్నారు. శ్రీల్లిశర్మ గాత్రం, శ్రీధరాచార్య మృదంగం, కె.ఎల్.ఎన్.మూర్తి వయోలిన్, ప్రకాష్ వేణువుతో అద్భుత వాద్యసహకారం అందించి ప్రదర్శనను మరింత రక్తికట్టించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన ప్రముఖులు సంస్థ 43వ వార్షికోత్సవం సందర్భంగా సంస్థ డైరెక్టర్ నిర్మలాప్రభాకర్‌ను, ఆమె అద్భుత శిక్షణతో తీర్చిదిద్ద కళాకుసుమ చిన్నారి కళాకారులను అభినందించారు.

## రామచందర్‌రావును సన్మానించిన బిజెపి నేతలు


రామచందర్‌రావును సన్మానిస్తున్న అంబర్‌పేట బిజెపి నేతలు

**అత్తాపూర్, జూలై 7 ప్రభాతవార్త :** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడుగా ఎన్నికైన మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావును అంబర్‌పేట నియోజకవర్గం బిజెపి నేతలు కలుసుకొని అభినందించారు. సోమవారం బాగ్‌అంబర్‌పేట్ డివిజన్ మాజీ అధ్యక్షుడు చుక్క జగన్, రాష్ట్ర నాయకుడు పి.గోవర్ధన్‌రెడ్డిలతో కలిసి పలువురు నేతలు ఎన్. రామచందర్‌రావును ఆయన నివాసంలో కలుసుకుని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎన్. రామచందర్ రావు వారికి కృతజ్ఞలు తెలుపుతూ పార్టీ కోసం మరింత కష్టించి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు అడప చంద్రమౌళి, దత్తు ముదిరాజ్, మల్కి రెడ్డి మల్లారెడ్డి, ఆంజనేయులు, పాకాల విజయ శేఖర్, దేవరుప్పుల రమేష్, మొహమ్మద్ షరీఫ్, బి.రాజు, గుగ్గిళ్ళ శ్రీనివాస్, చిట్టిబాబు, దండు భాస్కర్, సురేశ్ గౌడ్, బాలకృష్ణ గౌడ్, వంజరి రవీందర్, జి. రమేష్, శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

## మహిళాశక్తిని మరింత జాగృతపర్చాలి

**కుత్బుల్లా పూర్ జంట సర్కిళ్ల కమ్యూనిటీ అధికారి హరిప్రియ**

**కుత్బుల్లాపూర్, జూలై 7 ప్రభాతవార్త :** మహిళలు అన్నిరంగాలలో సమాజాన్ని ముందుకు తీసుకువెళ్లాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల కమ్యూనిటీ అధికారి హరిప్రియ అన్నారు. సోమవారం సర్కిల్ సమావేశమందిరంలో జరిగిన గాజులరామారం సర్కిల్ మహిళా సమాఖ్య ప్రతినిధులు పద్మ, దేవకరుణల ఆధ్వర్యంలో జరిగిన సమాఖ్య సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగాపాల్గొన్నారు. ఈసందర్భంగా హరిప్రియ మాట్లాడుతూ పొదుపు సంఘంలోని ప్రతిఒక్కరూ సంఘ శ్రేయస్సు తమ వ్యక్తిగత అభివృద్ధిగా భావించి తోడ్పడాలని సూచించారు. విధిగా నెలవారీ పొదుపును ఎప్పటికప్పుడు జమచేస్తూనే మరింతగా ప్రభుత్వం అమలు చేస్తున్న పలుపథకాలను, సద్వినియోగ పర్చుకోవాలని సూచించారు.

# గోవధ నిషేధ చట్టం కోసం కేంద్రంపై వత్తిడి చేస్తా

**రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య**


రాజుకు నియామకపత్రాన్ని అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

**సైఫాబాద్, జూలై 7 ప్రభాతవార్త:** గోవధ నిషేద చట్టం కోసం పార్లమెంట్‌లో కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వత్తిడి చేస్తానని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య చెప్పారు. మానవజాతి మనుగడకోసం గోవులు ఎంతగానో ఉపయోగపడతాయని, అందుకే కేంద్ర ప్రభుత్వం గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేసి గోమాతలను రక్షించాలని ఆయన కోరారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ప్రపంచవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నమో మిషన్ వందే గౌమాతరం సంస్థకు రాష్ట్రానికి చెందిన కీర్తిపల్లి రాజును యుఎస్‌ఎ ఎంపవర్‌మెంట్ వింగ్‌కు వ్యవస్థాపక సభ్యుడుగా, అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా నియామక పత్రాన్ని అందజేసి ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. పూర్వం ప్రతి ఇంటి ముందు గోవులు ఉండేవని, ఆ గోవుల ద్వారా వచ్చే పేడ ఎరువులుగా, పాలు తాగడానికి, నెయ్యి ఎంతో ఉపయోగపడేవని, నేడు గోవులు రోజురోజుకు కనుమరుగై పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దొంగచాటుగా గోవులను కొంత మంది వధిస్తున్నారని, పశు సంపద కరువైతే మానజాతి మనుగడ కష్టమవుతుందని ఆందోళన వక్తం చేశారు. ప్రపంచంలోని అనేక దేశాలు గోవుల ఉత్పతులను ఉపయోగించుకుంటున్నాయని, కాని మనదేశంలో పట్టించుకోవడం లేదన్నారు. భారతదేశంలో తిరిగి సేంద్రియ వ్యవసాయం అభివృద్ది చెందాలంటే గోవుల పెంపకం బాగా పెరగాలని, మనిషి ఆరోగ్యంతోపాటు పర్యావరణాన్ని కాపాడుకోవడానికి గోవుల ఉత్పత్తుల వాడకం పెరగాలని ఆయన సూచించారు. గోవుల రక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశానికి జాతీయ బిసి సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షత వహించగా, సంస్థ కో-ఫౌండర్ కవిత హందవి, గోమత మిషన్ చైర్మన్ మాద్విరాజ్, సినీ నటుడు సూర్య, బిసి నాయకులు జిల్లపల్లి అంజీ, సుధాకర్, పగిళ్ల సతీష్, పూర్ణచందర్, సాయి, భరత్‌గౌడ్ పాల్గొన్నారు.

## మహిళలు స్వయం శక్తితో ఆర్థికంగా ఎదగాలి

**ఆరెకపూడి గాంధీ**

**వివేకానందనగర్ కాలనీ, జూలై 7, ప్రభాతవార్త:** మహిళలు స్వయం శక్తితో ఆర్థికంగా ఎదగాలని పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. మహిళా శక్తి వేడుకలలో భాగంగా సోమవారం వివేకానంద నగర్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆయన కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, సభ్యులతో జరిపిన సమావేశంలో ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని మహిళ శక్తి పథకం చాలా గొప్పదని అన్నారు. ప్రభుత్వం చేయూత అందిస్తున్న వడ్డీ లేని రుణాలను పొందాలని ప్రతి ఒక్క మహిళ కూడా స్వయం సహాయక సంఘాలలో చేరి ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు ఆర్థికంగా ఎదగటానికి బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం పొంది అభివృద్ధి చెందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసి గంగాధర్ రావు, కార్పొరేటర్ నార్ని శ్రీనివాసరావు, ప్రాజెక్ట్ ఆఫీసర్ రాజశేఖర్, సంజీవరెడ్డి, దొడ్ల రామకృష్ణ గౌడ్, పోతుల రాజేందర్, ఇబ్రహీం, చంద్రమోహన్ సాగర్, పాపయ్య గౌడ్, ముస్తఫా, సుజాత స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని కాపాడండి : మాజీ కౌన్సిలర్


తహసీల్దార్ మతిన్‌కి ఫిర్యాదు చేసునతన్న శంకర్ నాయక్

**దుండిగల్, జూలై 7, ప్రభాతవార్త :** దుండిగల్ గ్రామ రెవెన్యూ పరిధిలోనే 684 సర్వే నెంబర్‌లోని 425.24ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాలని సోమవారం మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో దుండిగల్ తహసీల్దార్ మతిన్‌కి సోమవారం పిర్యాదు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమిని కొందరు పట్టపగలే కబ్జా చేసునతన్న అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. 5 సంవత్సరాల క్రితం 1000గజాలు తాండ ప్రజల అవసరం కోసం మల్టి పర్పస్ కమ్యూనిటీ ఫంక్షన్స్ హాల్ నిర్మానము కోసం దరఖాస్తు పెట్టుకుంటే ఇప్పటి వరకు కేటాయించలేదన్నారు. వెంటనే ఖబ్జా దారులపై చర్యలు తీసుకోవాలని సరిహద్దులు తేలేవరకు అక్కడ ఎలాంటి నిర్మాణలు చెపట్టాకూడదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.87.24 లక్షలు

**సంజీవరెడ్డినగర్, జూలై 7 ప్రభాతవార్త:** బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో సోమవారం 54 రోజుల హుండీ లెక్కింపు జరిగింది. ఈ హుండీల లెక్కింపు ఆలయ ఈఓ పి.మహేందర్‌గౌడ్, ఆలయ చైర్మన్ సాయిబాబాగౌడ్ ఆధ్వర్యంలో లెక్కింపు జరిగింది. ఈ హుండీ లెక్కింపులో ఎసాధారణ హుండీ నుండి 86 లక్షల 18 వుల 47 రూపాయలు రాగా, అన్నదానం హుండీ నుండి 1 లక్ష 6 వేల 555 రూపాయలు, 2 హుండీలను లెక్కించగా రూ.87 లక్షల 24 వేల 602 వచ్చినట్లు,దానితో పాటు విదేశీ కరెన్సీ, యూఎస్.డాలర్స్ 34, దిరమ్స్ 10, రీయాల్స్ 5, పౌండ్స్ 10, థాయ్‌లాండ్ కరెన్సీ 20, కొద్దిపాటి వెండి, బంగారం ఉన్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏసీ సంధ్యారాణి, ఎండోన్మెంట్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ అంబుజా, ఎండోన్మెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, అమీర్‌పేట కనకదుర్గ అమ్మవారి ఆలయ సూపరిండెంట్, పాలక మండలి సభ్యులు, అమీర్‌పేట తహశీల్దార్ కార్యాలయం సిబ్బంది ఎస్. ఆర్.నగర్ పోలీస్ శాఖ సిబ్బంది, బల్కంపేట ఎల్లమ్మ ఆలయ నూతన పాలక మండలి సభ్యులు, ఎస్.ఆర్‌నగర్ బ్యాంక్ ఆఫ్ బరోడా సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


బల్కంపేట ఎల్లమ్మ ఆలయ హుండీ లెక్కింపు దృశ్యం


వినతిపత్రాలు స్వీకరిస్తున్న శ్రీశైలం గౌడ్

## మినీ ఇండియా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం

**కూన శ్రీశైలంగౌడ్**

**పేట్‌బషీరాబాద్ జూలై 7, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తన నివాసం వద్ద రోజువారి కార్యాచరణలో భాగంగా పలు సమస్యలతో వచ్చిన నియోజకవర్గం ప్రజలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు ఆహ్వానాలు, వినతిపత్రాలను స్వీకరించి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అనేది భారతదేశంలో ఉన్న అన్ని జాతీప్రజల భంధగారం అని, దీనిని మినీ ఇండియా అంటుంటే ఎంతో సంతోషం కలుగుతుందన్నారు. నిరుద్యోగులకు, నిరుపేదలకు ఉపాధికల్పన స్తావరంగా కుత్బుల్లాపూర్ మారిందాన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయత్వంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి : ఆకుల సతీష్


ఫిర్యాదు చేస్తున్న ఆకుల సతీష్

**నిజాంపేట్, జూలై 7, ప్రభాతవార్త :** నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో పార్కులు, ప్రభుత్వ స్థలాలు, చెరువులు, రోడ్లు ఆక్రమించుకొని, అక్రమా అనుమతుల పూర్తి ఆధారాలతో నిర్మాణాలపై చర్యలు తీసుకొని, ప్రజాస్తులను కాపాడాలని ప్రస్తుతం నిజాంపేట్ మున్సిపల్ కమిషనకు పలుమార్లు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోకుండా, షోకాస్ నోటీసులు జారీచేసి చర్యలు తీసుకోకుండా అక్రమార్కులకు సహకరించడం ప్రస్తుత కమిషనర్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీ) రాధిక గుప్తాకు ప్రజావాణిలో ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ నిజాంపేట్ కార్పొరేషన్లో ప్రజలకు చెందిన ప్రభుత్వ భూములు, చెరువులు, పార్కులు, రోడ్లు నందు ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ప్రస్తుత కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన చర్యలు శూన్యం అని అన్నారు. ముఖ్యంగా బాచుపల్లి బంధం కుంట నందు విజన్ కన్స్ట్రక్షన్ చెరువులో తప్పుడు అనుమతులు తీసుకోవడమే కాకుండా, నిర్మాణంపై ఫిర్యాదు మేరకు నోటీసులు ఇచ్చి ఆరు నెలలు గడిచిన చర్యలు శూన్యం అని అన్నారు. బాచుపల్లి బ్లాక్ డైమండ్ కాలనీలో రెండు పార్కుల కబ్జాలపై, సాయి నగర్ ఫ్రీడమ్ పార్క్ ఆక్రమణ, అక్రమ నిర్మాణాలపై ప్రస్తుత కమిషనర్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం కాకుండా, అక్రమ నిర్మాణదారులకు సహకరించడంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ప్రజా ఆస్తుల్లో అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకుని, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అరుణ్ రావు, ఈశ్వర్ రెడ్డి, తిలోక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్ అందజేత

**అత్తాపూర్ జూలై 7, ప్రభాతవార్త :** విద్యార్థులు బాగా చదవి ఉన్నత శిఖరాలు ఎదగాలని రాజేంద్రనగర్ కార్పొరేటర్ అర్చన జయప్రకాష్ పేర్కొన్నారు. సోమవారం రాజేంద్రగన్ పరిధిలోని ఉప్పర్‌పల్లి ఎర్రబొండ ప్రైమరీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్‌ను కార్పొరేటర్ అర్చన జయప్రకాష్, రాజేంద్రనగర్ డివిజన్ బిఆర్‌ఎస్ ప్రెసిడెంట్ ధర్మారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పేద విద్యార్థులకు చేయూతనందించేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడా రంగంలో కూడా రాణించాలని మంచి చదవి తల్లిదండ్రులకు పేరుతీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో మంజుల సుజాత, సుమలత, గిరిబాబు పాల్గొన్నారు.

# దర్బార్ మహంకాళి మైసమ్మల బోనాల బ్రోచర్ ఆవిష్కరణ

**మెహిదీపట్నం, జూలై 7, ప్రభాతవార్త :** కార్వాన్ దర్బార్ మహంకాళి మైసమ్మల ఉమ్మడి బోనాల ఉత్సవాల బ్రోచర్‌ను చైర్మన్ ఠాకూర్ అమర్‌సింగ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బోనాల ఉత్సవాల కార్యక్రమ వివరాలను ఠాగూర్ అమర్‌సింగ్ వెల్లడించారు. కార్వాన్ దర్బార్ మహంకాళి మైసమ్మల ఉమ్మడి బోనాల ఉత్సవాలను ప్రతి ఏడు మాదిరిగానే ఈ సంవత్సరం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బోనాల ఉత్సవాలు ఈనెల 13న ప్రారంభమై 21న ముగుస్తాయన్నారు. 13వ తేదీ ఆదివారం ఘటము ఊరేగింపు పూజారి ముల్లె అంజయ్య ఇంటి నుండి ప్రారంభమై 18 వరకు ఘటము ఎదుర్కోలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. 19న అమ్మవారికి పంచామృతాభిషేకము, నవగ్రహ పూజ, ఘట స్థాపన, అఖండ దీపము, అష్ట బంధనము, అమ్మవారి తొట్టెల పురానాపూల్ పెద్ద శివాలయం నుండి బయలుదేరి పురానాపూల్, హర దర్వాజ, టప్పచ బుత్ర మీదుగా మందిరము ప్రాంగణం వరకు ఊరేగింపుగా దర్బార్ మైసమ్మ దేవాలయం వరకు చేరుకొని స్థాపన చేయడం జరుగుతుందన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. 20న బోనాల సమర్పణ, బాలబాలికలచే భరతనాట్య ప్రదర్శనలు, మాతా జాగరణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 21న పోతరాజు మహంకాళి దేవాలయం నుండి బయలుదేరి నల్ల పోచమ్మ దేవాలయం వద్ద గావు, బలిగంప ఊరేగింపు, విద్యార్థులకు బహుమతుల ప్రదానం, ఫలహార బండ్ల స్వాగతం, అమ్మవారి తొట్టెల నిమజ్జనంతో బోనాల ఉత్సవాలు ముగుస్తాయన్నారు. బోనాల ఉత్సవాలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.


బోనాల బ్రోచర్ ను ఆవిష్కరిస్తున్న దేవాలయ చైర్మన్ ఠాకూర్ అమర్ సింగ్



మాట్లాడుతున్న గడీల కుమార్‌గౌడ్

**బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాకే**

## స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

**-వెనకబడిన తరగతుల ప్రజాప్రతినిధుల వేదిక డిమాండ్**

**హైదరాబాద్, జూలై 7,ప్రభాతవార్త:** బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించి దాన్ని చట్టబద్దం చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని వెనకబడిన తరగతుల ప్రజాప్రతినిధుల వేదిక (బిసిపిఎఫ్) డిమాండ్ చేసింది. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర ఎంపిటిసిల సంఘం అధ్యక్షులు గడీల కుమార్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, సర్పంచుల జేఏసీ అధ్యక్షులు సుర్వియాదయ్య, ప్రధాన కార్యదర్శి ప్రనీల్‌చందర్ మాట్లాడారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 10న జరిగే క్యాబినేట్ సమావేశంలో ఎన్నికల ముందు చెప్పిన కామారెడ్డి డిక్లరేషన్‌లో పెట్టిన ప్రతిహామీని చర్చించి నెరవేర్చాలన్నారు. అదేవిధంగా బీసీ సామాజిక వర్గాల సర్వే నిర్వహించాలన్నారు. అంతేకాకుండా 33శాతం మహిళా రిజర్వేషన్లలో కూడా బీసీ మహిళలకు సబ్‌కోటా కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయని పక్షాన పార్టీలకు అతీతంగా రాష్ట్రంలోని బి.సి సామాజిక ప్రజాప్రతినిధులతో పాటు ప్రజలను భాగస్వామ్యం చేసి ఈనెల 15వ తేది న ఇందిరా పార్క్ వద్ద 10 వేల మంది బిసి ప్రజాప్రతినిధులుసభకు వార్డ్ మెంబర్ నుండి ఎమ్మెల్యే ఎంపీల వరకు రాష్టం లోని అన్ని రాజకీయపార్టీలనుంచి ప్రజాప్రతినిధులు పెద్దయెత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. అప్పటికి ప్రభుత్వం స్పందించకపోతే మరో సకల జనుల సమ్మె తరహాలో మరో ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చెరుకు లింగంగౌడ్, యాదగిరి, సత్యం సాగర్, శ్రీనివాస్‌గౌడ్, సంగన్న, గున్నల అరుణ్ కుమర్ మైపాల్, తిరుపతయ్య, సదానందం పాల్గొన్నారు.

## ముదిరాజ్‌లను బిసిడి నుంచి బిసి ఎ లోకి మార్చాలి

**-తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి**


మాట్లాడుతున్న మహేష్

**హైదరాబాద్, జూలై 7,ప్రభాతవార్త:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్ సామాజిక వర్గానికి జనాభా దామాషా ప్రకారం అధిక సీట్లు కేటాయించాలని అన్ని రాజకీయ పార్టీలకు తెలంగాణ రాష్ట్ర ముదిరాజుల పోరాటా సమితి విజ్ఞప్తి చేసింది. ఈమేరకు సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమితి నేతలు సుంకరబోయిన మహేశ్, అశోక్ ముదిరాజ్. పులి దేవేందర్, రంజిత్‌ముదిరాజ్ మాట్లాడారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజ్ సామాజిక వర్గానికి మంత్రివర్గంలో అవకాశం కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ముదిరాజ్‌లను బిసి-డి నుంచి బిసి-ఏగ్రూపులోకి మార్చిన తర్వాతనే ప్రభుత్వంఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ పాదవుల్లో మండల, జిల్లా ఆధ్యక్షుల ఎంపికల్లోనూ ముదిరాజ్ కు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. వచ్చే ఏడాది ఖాళీ కాబోతున్న ఎంఎంఎల్ సి స్థానం భర్తీకి ముదిరాజ్ ఆత్మగౌరవ ప్రతీక అయిన నీలం మధు ముదిరాజ్‌కు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ బందూక్, ప్రజావీరుడు పండుగ సాయన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, మహబూబ్‌నగర్ జిల్లాకు ఆయన పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సమితి నేతలు రవి, శేఖర్, చందు పాల్గొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి: ఎమ్మెల్యే

**అల్వాల్, జూలై 7 ప్రభాతవార్త:** రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిని ముందుకు తీసుకుని వెళుతున్నామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం అల్వాల్ డివిజన్ పరిధిలోని ఆదర్శనగర్‌లో 80లక్షలు వ్యయంతో ఏర్పాటు చేయనున్న బాక్స్ డ్రైన్, సిసి రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అభివృద్ధికి ప్రజలు సహకారం అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దశాబ్దాలుకాలంగా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు, బిఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

## సిఐ వెంకటసుబ్బారావుకు సన్మానం

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 7, ప్రభాతవార్త :** రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి కూకట్పల్లి సీఐ వెంకట సుబ్బారావుని కలిసి శాలువాతో సన్మానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రజల అవసరాలకు శాంతి భద్రత విషయంలో ప్రజల సహకారంతో కలిసి మెలిసి ముందుకు వెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జి ప్రసాద్, కొండలరావు, కిషోర్, శ్రీధర్, సూర్యనారాయణ తదితరులు కలిశారు. అధ్యక్షులు పురంధర్ రెడ్డి సిఐకి వివేకానంద నగర్ డివిజన్ ఎస్సై చంద్రశేఖర్‌కి రామకృష్ణ ఎస్సై డీన్‌కి శాలువాలతో సన్మానం చేశారు.

## రాందేవ్ ఆసుపత్రి డాక్టర్లకు అరుదైన గౌరవం, సత్కారం



డాక్టర్లను సత్కరిస్తున్న దృశ్యం

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 7, ప్రభాతవార్త :** ప్రపంచ వైద్యుల దినోత్సవం సందర్భంగా బిసి రాయ్ మెడికల్ ఎక్సెలన్స్, ఏపిజె అబ్దుల్ కలాం మెడికల్ ఎక్సెలెన్స్ అవార్డులను యాక్ట్ నౌ ఫౌండేషన్ ద్వారా రాందేవ్రావు హాస్పిటల్‌లో పనిచేస్తున్న అత్యంత అనుభవం కలిగిన 28 మంది డాక్టర్లను సత్కరించి గౌరవించారు. ఇందులో భాగంగా హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్‌కి 57 సంవత్సరాలు దేశ రక్షణలో వైద్య రంగంలో అపార అనుభవం కలిగినందుకు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డుతో సత్కరించారు. డాక్టర్ కె ఛాయా దేవికి లివింగ్ లెజెండ్ అవార్డుతో సత్కరించారు. స్త్రీ, ప్రసూతి విభాగంలో 55 సంవత్సరాల అనుభవం ఉన్నందున ఈ అవార్డు ఇచ్చి సత్కరించారు. రాందేవ్రావు ఆసుపత్రిలోని వివిధ భాగలలో పనిచేస్తున్న డాక్టర్లు ధనలక్ష్మి మ్, పి శ్రీనివాసులు, జై సుధారాణి, పి భవాని దివ్య, ఎల్ ప్రమోదిని, ఎం మంజుల, సుప్రియ, పావని, రాజీవ్ వర్మ, లోకేష్ రెడ్డి, కార్తీక్, మౌనిక, స్వాతి రెడ్డి, సుమ, నాగేంద్ర, సైదులు, స్మిత, ధృతి, స్వాతి, రాధా, మంజుల, శ్రీదివ్య, సత్యనారాయణ లను ఏపీజే అబ్దుల్ కలాం అవార్డులతో సత్కరించారు. అలాగే ఆసుపత్రి సీఈవో డాక్టర్ ఎన్. యోబుని ఎక్సలెన్స్ ఇన్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ పియోనిర్ అవార్డుతో సత్కరించారు.

## ఆల్విన్ కాలనీలో ఘనంగా పీర్ల పండుగ...

**కెపిహెచ్బి కాలనీ, జూలై 7, ప్రభాతవార్త :** ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ లోని కమాన్ ఎదురుగా ఉన్న దర్గాలో ఖాజా ఆధ్వర్యంలో నిర్వహించిన పీర్ల పండుగ ఉత్సవానికి ముఖ్యఅతిథిగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై పీర్ల దేవుళ్ల ప్రతిమలను పూజించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉండే ముస్లింలందరూ రంజాన్, బక్రీద్ తర్వాత జరుపుకునే ముఖ్యమైన పండుగల్లో మొహర్రం (పీర్ల పండుగ) ఒకటి అని అన్నారు. డివిజన్ ప్రజలందరూ కులమతాలకి అతీతంగా అన్ని పండుగలు ఆనందంగా జరుపుకోవాలని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఖలీమ్, హుస్సేన్, రఫిఖ్ తదితరులు పాల్గొన్నారు.

